సాక్షి నల్లగొండ

సోమవారం। 27 । జనవరి। 2025



దేశానికే ఆదర్శం

పథకాల అమలులో దేశానికే తెలంగాణ ఆదర్శమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రద్దీ నెలకొంది. - 8లో



స్వగ్రామానికి భౌతికకాయం

అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన రవితేజ భౌతికకాయానికి స్వగ్రామంలో అంత్యక్రియలు ముగిశాయి. - 8లో

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్లకు మున్సిపాలిటీల బాధ్యతలు

- ప్రత్యేక అధికారులుగా నియామకం
- కొనసాగనున్న నకిరేకల్ మున్సిపల్ పాలకవర్గం

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి జిల్లాలోని 18 మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగిసింది. మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులుగా కొనసాగనున్నారు. నల్లగొండ జిల్లాలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుండడంతో ఆయనే నల్లగొండ జిల్లాలోని మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా ఉండనున్నారు. కాగా.. నకిరేకల్ మున్సిపాలిటీ పాలకవర్గం గడువు ఉండటంతో యథావిధిగా కొనసాగనుంది. మిగతా మున్సిపాలిటీలన్నింటికి మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు అదనపు కలెక్టర్లు బాధ్యతలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీసీ రోడ్డు పనులకు ఎస్పీ శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ : జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో 800 మీటర్ల సీసీ రోడ్డు పనులకు ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ ముసాబ్ అహ్మద్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాఘవరావు, ఆర్‌ఐ సంతోష్, గుమ్మల మోహన్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు మహాధర్నా ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ టూటౌన్ : హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 28న నల్లగొండలో జరుగనున్న మహాధర్నా ఏర్పాట్లను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండలోని గడియారం సెంటర్ వద్ద మంగళవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు ధర్నా ఉంటుందన్నారు. ఈ ధర్నాకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని.. రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, నిరంజన్ వలి, సింగం రామ్మోహన్, భువనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, రావుల శ్రీనివాసరెడ్డి, మెరుగు గోపి, బొజ్జ వెంకన్న, గంజి రాజేందర్ ప్రకాష్, రుద్రాక్ష వెంకన్న, బుజ్జ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు.ఇక ప్రథమ ప్రాకార మండపంలో పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు.

41,922 మందికి పథకాలు

- అత్యధికంగా 31,556 మందికి రైతు భరోసా

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలు ఆదివారం జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రారంభమయ్యాయి. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని 10,374 కుటుంబాలకు సంబంధించిన 41,922 మందికి పథకాలను అందజేసింది. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో అత్యధికంగా రైతు భరోసా 31,556 మందికి అందించారు. అలాగే 713 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 4,976 మందికి కొత్త రేషన్ కార్డులు, 4,677 మందికి ఇందిరమ్మ ఇళ్లను అందజేశారు.

సంక్షేమమే ధ్యేయం

- పకడ్బందీగా పథకాల అమలు
- ప్రజల అభ్యున్నతికి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దోహదం
- అర్హులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ముందుకు..

గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి

> ప్రజల బంగారు భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రారంభించింది. వాటిని పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం.
> \- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండలోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

నల్లగొండ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 76వ గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రగతిని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

5,11,638 కుటుంబాల సర్వే

జిల్లాలో 4,060 మంది ఎన్యుమరేటర్లు, 409 మంది సూపర్‌వైజర్లు, ఇంటింటి కుటుంబ సర్వే చేసి 5,11,638 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఈ సర్వే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను పక్కాగా అమలు చేయడానికి దోహదపడుతుంది.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్ ప్రయాణం అమలు చేస్తున్నాం. రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 2,33,981 మంది రైతులకు రూ.2044.83 కోట్ల రుణమాఫీ అందించాం. రైతు బీమా కింద 471 మంది నామినీలకు రూ.23.55 కోట్లు జమచేశాం.

సన్నాలకు బోనస్

రైతుల నుంచి వానాకాలం 2,74,345 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని 48 గంటల్లో రూ.636 కోట్లు ఖాతాల్లో జమ చేశాం. 72,998 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో బోనస్ కూడా జమ చేశాం.

ఎస్‌ఎల్‌బీసీ పనులు 70శాతం పూర్తి

బ్రాహ్మణవెల్లెంల, ఉదయ సముద్రం లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు, రిజర్వాయర్ పనులు గత నెలలో పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభించాం. దీని ద్వారా లక్ష ఎకరాలకు నీరందిస్తాం. డిస్ట్రిబ్యూటరీల పనులు పురోగతిలో ఉన్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు 70 శాతం పూర్తయ్యాయి. డిండి లిఫ్టు ఇరిగేషన్ పనులు కూడా వివిధ దశల్లో ఉన్నాయి. అన్నీ పూర్తి చేసి ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించనున్నాం.



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

పురోగతిలో సబ్‌స్టేషన్ల పనులు

గృహజ్యోతి కింద ప్రభుత్వం 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తోంది. రూ.36 కోట్లతో 4000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో దామరచర్లలో థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇటీవల ఒక యూనిట్‌ను సీఎం చేతుల మీదుగా ప్రారంభించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 5,400 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశాం. 35 విద్యుత్ ఉప కేంద్రాల పనులు పురోగతిలో ఉన్నాయి.

మెడికల్ కాలేజీ ప్రారంభించాం

పేదలకు వైద్య విద్యను అందించేందుకు ప్రభుత్వ వైద్య కాలేజీ ప్రారంభించాం. రూ.40 కోట్లతో నర్సింగ్ భవనాన్ని కూడా నిర్మిస్తున్నాం. ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలో వైద్య సేవలతో పాటు శస్త్ర చికిత్సలు కూడా అందిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా జిల్లాలో మొదటి విడతగా 938 పాఠశాలలు ఎంపిక చేసి రూ.40.83 కోట్లతో సివిల్ పనులు పూర్తిచేశాం.

పింఛన్లతో చేయూత

చేయూత పథకం ద్వారా వృద్ధాప్య వితంతు, కల్లుగీత, బీడీ, చేనేత కార్మికులతో పాటు దివ్యాంగులకు పింఛన్లు ఇస్తున్నాం. 2093 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందిస్తున్నాం.

రూ.870 కోట్లతో రోడ్ల నిర్మాణం

జిల్లాలో రూ.870 కోట్లతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.పంచాయతీరాజ్ శాఖ ద్వారా రోడ్లు, భవనాల నిర్మాణం ముమ్మరంగా సాగుతోంది. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10.90 కోట్లు విడుదలయ్యాయి. ఎనిమిది మున్సిపాలిటీల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీరోడ్లు, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా వేగంగా సాగుతోంది. 39 దేవాలయాల్లో రూ.15 కోట్లతో పునరుజ్జీవ పనులు చేపట్టాం. జిల్లాలో టీఎస్ ఐపాస్ చట్టం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 534 మందికి ఉపాధి కల్పించాం. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్‌శాఖ పటిష్టంగా అమలు చేస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు షీటీమ్‌లు సమర్థవంతంగా పని చేస్తున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజలను కూడా భాగస్వాములను చేస్తున్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న శాసన మండలి చైర్మన్, జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రధాన న్యాయమూర్తి, ఎస్పీ, జిల్లా అధికారులు, ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, స్వతంత్ర సమర యోధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలకు గుర్తింపు

\- వివరాలు 8లో



సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

రైతుభరోసా సాయం పెంపు

రైతుభరోసా సాయాన్ని ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచి 11,90,896 ఎకరాల భూమిని సాగుకు యోగ్యమైనది గుర్తించాం. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తాం. నియోజక వర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇళ్లకోసం జిల్లాలో 4,31,831 మంది దరఖాస్తు చేసుకోగా.. అన్నీ పరిశీలించి 1,97,890 మందిని అర్హులుగా గుర్తించి గ్రామసభల్లో జాబితా ఉంచాం. ఇంటి నిర్మాణానికి వివిధ దశల్లో రూ.5 లక్షలు అందిస్తాం.



జెడ్పీహెచ్‌ఎస్ ఎల్లారెడ్డిగూడెం విద్యార్థుల నృత్య ప్రదర్శన

పథకాలు నిరంతరం కొనసాగుతాయి

- లబ్ధిదారులు ఆరునెలల్లో ఇళ్లు నిర్మించుకోవాలి
- మంత్రితో కలిసి గృహప్రవేశానికి వస్తా
- జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్
- గుండ్లపల్లిలో నాలుగు పథకాల అమలుకు శ్రీకారం



ప్రొసీడింగ్ అందజేస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు నిరంతరం కొనసాగుతాయని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఈ నాలుగు పథకాల అమలులో భాగంగా నల్లగొండ మండలం, గుండ్లపల్లి గ్రామంలో ఈ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు ఉత్తర్వులను అందజేశారు. 115 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 90 మందికి రేషన్‌కార్డులు, 12 మందికి ఆత్మీయ భరోసా, 652 మందికి రైతు భరోసా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకాల కింద లబ్ధిపొందని వారు బాధపడాల్సిన అవసరం లేదని, పథకాలన్నీ నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. గుండ్లపల్లిలో ఇళ్లు మంజూరు చేసిన 115 మంది లబ్ధిదారులు త్వరగా గృహాలు నిర్మించుకోవాలని, ఆరు నెలల్లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి గృహ ప్రవేశాలకు వస్తామన్నారు. పథకాలను గుండ్లపల్లిలో పండుగ వాతావరణంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజున పథకాలను ప్రారంభించి పేదలకు లబ్ధి చేకూర్చడం సంతోషంగా ఉందన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి మొదటి విడుతలో ఇళ్లు మంజూరు చేశామని.. మిగిలిన వారికి కూడా మంజూరు చేస్తామని తెలిపారు. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచలో నాలుగు పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రజలు తిలకించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి అహ్మద్ ఖాద్రీ, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ పనస శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ కాపీలు చూపుతున్న లబ్ధిదారులు

కిడ్నీ రాకెట్ ప్రకంపనలు

- హైదరాబాద్‌లో అరెస్టయిన వారిలో నలుగురు నల్లగొండ వాసులే
- అలకనంద ఆస్పత్రిలో మెడికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆ నలుగురు
- తాజా ఉదంతంతో తెరపైకి 2016 నాటి కిడ్నీ మార్పిడి వ్యవహారం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన కిడ్నీ మార్పిడి రాకెట్ సంఘటన నల్లగొండలో ప్రకంపనలు సృష్టిస్తోంది. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ రాకెట్‌లో అరెస్టయిన వారిలో నల్లగొండకు చెందిన నలుగురు మెడికల్ అసిస్టెంట్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. 2016లో నల్లగొండలో జరిగిన కిడ్నీ రాకెట్ సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ రాకెట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు డబ్బుల కోసం కిడ్నీ అమ్ముకొని, చివరికి అతనే ఏజెంట్‌గా మారాడు. ఆ సంగతి మరచిపోతున్న తరుణంలో ఇప్పుడు మళ్లీ హైదరాబాద్‌లో కిడ్నీ మార్పిడి రాకెట్ బయటపడింది. ఈ కేసును ఛేదించిన పోలీసులు ఆస్పత్రి వైద్యుడితోపాటు అందులో భాగస్వాములైన సిబ్బందిని అరెస్టు చేశారు. వారిలో అదే ఆస్పత్రిలో మెడికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు ఉండటంతో జిల్లాలో కిడ్నీ



రాకెట్ ప్రకంపనలు మొదలయ్యాయి.

ఐదుగురిలో.. నలుగురు నల్లగొండ వారే

హైదరాబాద్‌లోని అలకనంద ఆస్పత్రిలో ఏడు నెలలుగా చట్టవిరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్న కేసులో రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు శనివారం పలువురిని అరెస్టు చేశారు. అందులో అలకనంద ఆసుపత్రి ఎండీ గంటుపల్లి సురేష్, డాక్టర్ సిద్ధంశెట్టి అవినాష్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సోహిబ్‌ను అరెస్టు చేశారు. వారితోపాటు మెడికల్ అసిస్టెంట్లు ఐదుగురిని అరెస్టు చేశారు. వారిలో ఆస్పత్రి రిసెప్షనిస్ట్ నర్సగాని గోపి మినహా మిగతా నలుగురు నల్లగొండ జిల్లాకు చెందినవారే ఉన్నారు. వారిలో నల్లగొండలో నివాసం ఉంటున్న రమావత్ రవి, సపావత్ రవీందర్, సపావత్ హరీష్, పొదిల సాయి ఉన్నారు. వారంతా ఈ కిడ్నీ మార్పిడి రాకెట్‌లో అరెస్టు కావడంతో నల్లగొండ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

బాధితుడి నుంచి ఏజెంట్‌గా..

మొదట ఆర్థిక అవసరాలం కోసం కిడ్నీ అమ్ముకున్న సురేష్‌కు కిడ్నీల వ్యాపారం ద్వారా డబ్బు సంపాదించాలనే ఆలోచన వచ్చింది. తనకు పరిచయమున్న వారిని డబ్బు ఆశ చూపెట్టి కిడ్నీల వ్యాపారానికి తెరతీశాడు. ఇదే క్రమంలో నల్లగొండలో సస్పెండ్ అయిన ఉద్యోగి పరిచయం కావడం, అతడి కిడ్నీ కూడా విక్రయించేలా ఒప్పించాడు. కిడ్నీ ఇచ్చినందుకు బాధితుడికి రూ.5 లక్షలు, ఏజెంట్‌గా సురేష్‌కు రూ.50 వేలు ఇచ్చారు. ఇలా నల్లగొండ జిల్లాలో ముగ్గురు, హైదరాబాద్‌లో నలుగురు, బెంగుళూరులో నలుగురు, తమిళనాడులో ఇద్దరు కిడ్నీలు ఇచ్చేలా ఒప్పించి కమీషన్ పొందాడు. సోషల్ మీడియా ద్వారా కిడ్నీల వ్యాపారాన్ని ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు విస్తరించాడు. ఈ వ్యవహారం నల్లగొండ పోలీసులకు చేరడంతో అప్పటి ఎస్పీ విక్రమ్‌జిత్ దుగ్గల్ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. నల్లగొండలో సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా 2014 నుంచే ఈ కిడ్నీ మార్పిడి రాకెట్ జరిగినట్లు బయటపడింది. కిడ్నీలు అమ్ముకునే వారికి ముంబైలో వైద్య పరీక్షలు నిర్వహించి, కొలంబోలోని వెస్టర్న్, నవలోక్ ఆస్పత్రుల్లో కిడ్నీల మార్పిడి చేశారు. ఈ వ్యవహారంలో విదేశీ డాక్టర్లు కూడా ఉండటం గమనార్హం.

2016లో ఎలా జరిగిందంటే..

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్లగొండలో కిడ్నీ మార్పిడి రాకెట్ 2016 జనవరిలో బయట పడింది. నల్లగొండకు చెందిన సురేష్ అనే యువకుడు హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. అతని అవసరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాడు. అదే క్రమంలో ఆన్‌లైన్‌లో కిడ్నీదాతలు కావాలనే ప్రకటనతో అతను వారితో మాట్లాడి తాను కిడ్నీ ఇస్తానని ఒప్పుకున్నాడు. ఆ తరువాత ముంబైకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. ఆ తరువాత ప్రధాన ఏజెంట్లు అతన్ని శ్రీలంకలోని కొలంబోలోని వెస్టర్న్ ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి దాతకు కిడ్నీ ఇచ్చాడు. అందుకుగాను రూ.5 లక్షలు వారి నుంచి సురేష్ తీసుకున్నాడు.

మెడికల్ అసిస్టెంట్లేనా?

నల్లగొండకు చెందిన వారు కిడ్నీ మార్పిడి వ్యవహారంలో కేవలం మెడికల్ అసిస్టెంట్లుగా వ్యవహరించారా? పొట్టకూటి కోసమే అక్కడ ఉద్యోగంలో చేరారా? అన్నది తేలాల్సి ఉందన్న చర్చ సాగుతోంది. ఈ రాకెట్‌లో వారి పాత్ర ఏంటన్న దానిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నల్లగొండ జిల్లా నుంచి కూడా కిడ్నీ విక్రయాలు జరిగాయా? అన్న సందేహం కలుగుతోంది. జిల్లా పోలీసులు కూడా ఈ అంశంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పాత కేసుతో వీరికి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పరిశీలన జరిపి.. ప్రస్తుతం అరెస్టయిన వారికి అప్పటి కేసుతో సంబంధం లేదని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. తాజా కేసులో జిల్లా నుంచి కిడ్నీలు అమ్ముకునే దాతలను వీరు ఏమైనా సంప్రదించారా? అనే అంశంపై దృష్టి సారించినట్లు సమాచారం.



నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కవాతు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు



పోలీసు శాఖ రూపొందించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల శకటం



డ్రోన్ స్ప్రేయర్‌కు జాతీయ జెండా అమర్చిన దృశ్యం





సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జి. శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ ఇరిగేషన్, ఏఎమ్మార్పీ, నల్లగొండ

ఉత్తమ సేవలకు గుర్తింపు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులకు గుర్తింపు లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి పలువురు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ, నల్లగొండ | దేవ్‌సింగ్, తహసీల్దార్, నాంపల్లి | కె. సుజాత, ఎంపీడీఓ, అనుముల | విజయకుమారి, ఎంపీఓ, త్రిపురారం | సామ్యూల్ జాకోబ్, మైన్స్ అండ్ జియాలజీ నల్లగొండ | వై. అశోక్‌రెడ్డి, ఆర్డీఓ, నల్లగొండ



జి.వెంకటేశ్వర్లు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, నల్లగొండ | సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ | శారద, ఏపీడీ, డీఆర్‌డీఓ నల్లగొండ, స్పెషల్ ఆఫీసర్, తిరుమలగిరి(సాగర్) | రాజు, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీఓ త్రిపురారం | ఎల్. మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్, కేతేపల్లి | ఎం. మోతిలాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కలెక్టరేట్ నల్లగొండ | ఎండీ షేక్ షఫీ, నాయబ్ తహసీల్దార్ | డి. ప్రసాద్, సీసీ టు కలెక్టర్ | జి. జలంధర్, సీసీ టు అదనపు కలెక్టర్ | జి. రాధ, సీనియర్ అసిస్టెంట్ | వి. రూప, జూనియర్ అసిస్టెంట్ | మహ్మద్ ఫర్హా ఖానం, టైపిస్టు



యాకుబ్ పాష, డ్రైవర్, కలెక్టర్ పేషి | ఎస్. అనిల్‌కుమార్, ఆఫీస్ సబార్డినేట్ | ఎం. సత్యనారాయణ, ఆఫీస్ సబార్డినేట్, అదనపు కలెక్టర్ పేషి | పి. యాదగిరి, తహసీల్దార్ శాలిగౌరారం | ఆర్. రామకృష్ణ, నాయబ్ తహసీల్దార్ నార్కట్‌పల్లి | ఎన్.వెంకన్న, సీనియర్ అసిస్టెంట్, తహసీల్ ఆఫీస్, శాలిగౌరారం | కె.వి.తరుణ్, గిర్దావర్, తహసీల్ ఆఫీస్, నార్కట్‌పల్లి | జి. రామకృష్ణ, గిర్దావర్, నకిరేకల్ | జి.సంతోష్ కిరణ్, తహసీల్దార్, దేవరకొండ | బి. దీవెన మధుహాసిని, తహసీల్దార్, గుడిపల్లి | నర్సింహారావు అలియాస్ ప్రశాంత్, నాయబ్ తహసీల్దార్, కొండమల్లేపల్లి | ఎండీ మునీర్, ఏఆర్ సబ్‌ఇన్‌స్పెక్టర్



పి. మధు, పోలీస్ కానిస్టేబుల్ | తిరగమల్ల ప్రవీణ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ | నాగుబండి శైలజ, మేనేజర్ | జి. హరీష్‌కుమార్, సిస్టమ్ మేనేజర్ | గాదరి మంజుల, పబ్లిక్ హెల్త్ వర్కర్ | ఆర్. ధనలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ చిట్యాల | బి. రాణాప్రతాప్‌సింగ్, సర్వేయర్, నాంపల్లి | సీహెచ్.చలపతి, సూపరింటెండెంట్ ఎంపీపీ ఆఫీస్, కట్టంగూర్ | ఎస్పీ జయలక్ష్మి, ఎంపీడీఓ, చిట్యాల | బి. నరహరి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్, నకిరేకల్(సెర్ప్) | ఐ.దస్రూ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, చిత్రియాల బీట్ దేవరకొండ | కనకదుర్గ, ఏఓ, డీఏఓ నల్లగొండ



బొడ్డుపల్లి కరుణ, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ జెడ్పీహెచ్‌ఎస్, గుడిపల్లి | వి. విజయ్‌కృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీస్, నల్లగొండ | డాక్టర్ జి. రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్, కనగల్ | డాక్టర్ వి. శ్రీధర్, సైంటిస్ట్, జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ | డాక్టర్ వి. నగేష్, డిప్యూటీ సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి నల్లగొండ | కె. శివరాంరెడ్డి, డీఎస్పీ నల్లగొండ | జి. రమేష్, డీఎస్పీ ఎస్‌బీ, నల్లగొండ | ఐ. లావణ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, నల్లగొండ | సీహెచ్. భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎంవీఐ నల్లగొండ | మహ్మద్ ఖమ్రుద్దీన్, టైపిస్ట్, రిజిస్ట్రార్ కార్యాలయం, నల్లగొండ | మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్, నల్లగొండ | గీత, సూపరింటెండెంట్, పశుసంవర్ధకశాఖ, నల్లగొండ

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు

నల్లగొండ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసి అర్హులైన పేదలకు అందించే విషయంలో అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, జిల్లా అధికారులు ఎం. శ్రీనివాస్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ సిబ్బందికి, జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస్, సీఐలు రాఘవరావు, రాజశేఖర్‌రెడ్డి, శివశంకర్, శ్రీనునాయక్, మహాలక్ష్మయ్య, ఆర్‌ఐలు సంతోష్, శ్రీనివాస్, సూరప్పానాయుడు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సోమయ్య పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వ అధికారికి కార్డియాక్ స్ట్రోక్

● సీపీఆర్ చేసిన డీఎంహెచ్‌ఓ

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన పబ్లిక్ హెల్త్ డిప్యూటీ టెక్నికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆజమ్‌కు కార్డియాక్ స్ట్రోక్ వచ్చింది. ఆ సమయంలో అక్కడే ఉన్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ స్పందించి ఆజమ్‌కు సీపీఆర్ చేసి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆజమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వలిగొండ: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వలిగొండ మండలం నాతాళ్లగూడెంలో భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు పథకాలను ప్రారంభించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణలో రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని, 155 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేశామన్నారు. సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. తాము 24 గంటలు కష్టపడి నిజాయితీగా పనిచేస్తుంటే.. బీఆర్‌ఎస్ నాయకులు ఓడిపోయిన ఫ్రస్టేషన్‌లో అర్థరహితంగా మాట్లాడుతున్నరని విమర్శించారు. అనంతరం ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. సాగునీటి కాల్వలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.500 కోట్లు మంజూరు చేశారని, ఈ నిధులతో కాల్వల ఆధునీకరణ పూర్తిచేస్తామని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, డీఆర్డీఓ నాగిరెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. గణతంత్ర దినోత్సవంతో పాటు ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులు అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మెట్ల దారి, కొండ కింద శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణ కట్ట, లక్ష్మీపుష్కరిణి, ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామివారిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఆలయానికి నిత్యాదాయం రూ.39,45,629 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

స్వామి సేవలో ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సినీ ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. రామ్‌లక్ష్మణ్‌తో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు.



ఆలయ ఉత్తర మాడ వీధిలో భక్తుల రద్దీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ: రోడ్డు దాటుతున్న వ్యక్తిని బొలేరో వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం దామరచర్ల మండల కేంద్రానికి చెందిన వీర్ల కోటయ్య(55) నడుచుకుంటూ మండల కేంద్రంలోని వీర్లపాలెం రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీకొట్టింది. కోటయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కోటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వగ్రామానికి రవితేజ భౌతికకాయం

చౌటుప్పల్ రూరల్: అమెరికాలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో మృతిచెందిన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ రవితేజ(26) మృతదేహం వారం రోజుల తర్వాత ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకుంది. బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య రవితేజ అంత్యక్రియలు సాయంత్రం ముగిశాయి. రవితేజ భౌతికకాయానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవితేజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. రవితేజ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నల్లబెల్లం, నాటుసారా పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లంను చూపుతున్న పోలీసులు

మర్రిగూడ: కారులో తరలిస్తున్న నల్లబెల్లం, నాటుసారాను ఆదివారం మర్రిగూడ మండలం అజ్జిలాపురంలో పోలీసులు పట్టుకున్నారు. నాంపల్లి ఎక్సైజ్ సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. అజ్జిలాపురం గ్రామానికి చెందిన మేగావత్ కిరణ్‌కుమార్ కారులో 90కిలోల నల్లబెల్లం, 5కిలోల ఆలమ్, 3లీటర్ల నాటుసారా తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. కారు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌కు బెస్ట్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాక్టీస్ అవార్డు

నల్లగొండ: ఓటర్ల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా నల్లగొండ కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌లో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం. విజయ్‌కుమార్ బెస్ట్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాక్టీస్ అవార్డు అందుకున్నారు. ఓటర్ల జాబితా తయారీలో కీలకపాత్ర వహించినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్ అవార్డులను ప్రకటించింది. అందులో నల్లగొండ నుంచి విజయ్‌కుమార్‌కు అవార్డు అందజేశారు.